




చుక్కనీరు లేక అలంకారప్రాయంగా అన్నమయ్య ప్రాజెక్టు ఊటకాలువ

'అన్నమయ్య' కోపం.. అన్నదాతకు శాపం!

- మూడేళ్లుగా బీడుగానే 22,500 ఎకరాల ఆయకట్టు
- అడుగంటిన భూగర్భజలం



భూగర్భజలాలు లేక ఎండిపోతున్న అరటి తోట



దీనస్థితిలో అన్నమయ్య ప్రాజెక్టు



సాగునీరు లేక బీళ్లుగా మారిన భూములు

రాజంపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య ప్రకోపంతో ప్రాజెక్టు కొట్టుకుపోయిన అనంతరం రాజంపేట, పుల్లంపేట మండలంలోని పైతట్టు ప్రాంతాల ప్రజలు మూడేళ్లుగా తాగు, సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 22,500 ఎకరాల ఆయకట్టు ఎడారిగా మారిపోయింది. అన్నమయ్య ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి ఆకేపాడు, చెర్లోపల్లె, హస్తవరం, పెద్దకారంపల్లె, బ్రాహ్మణపల్లె, కూచివారిపల్లె, మిట్టమీదపల్లె, బావికాడపల్లె, వత్తలూరు, పుల్లంపేట, రాజంపేట ఎగువ ప్రాంతాలకు అన్నమయ్య ప్రాజెక్టు నుంచి 20 ఏళ్లుగా పుష్కలంగా తాగు, సాగునీరు అందేది. ప్రాజెక్టు ప్రధాన కాలువ కింద ఖరీఫ్, రబీ సీజన్‌లో కలిపి 22,500 ఎకరాల్లో అరటి, బొప్పాయి, నిమ్మ, మామిడి, పసుపు, వేరుశనగ, ఇతర వాణిజ్య పంటలను సాగు చేసేవారు. ఈ ప్రాజెక్టు కొట్టుకుపోవడం, సగటు వర్షపాతం కూడా కురవకపోవడంతో భూగర్భజలం 2 వేల అడుగుల్లోకి ఇంకిపోయింది. పూర్వం ఈ ప్రాంతంలో ప్రతి ఏటా కరువు కరాళ నృత్యం చేసేది. వర్షాకాలంలో కూడా 1500 అడుగుల లోతు వరకూ బోరు వేసినా నీరు పడేది కాదు. దీనివల్ల ఒకటి రెండు మినహా అన్ని గ్రామాల ప్రజలు తాగు, సాగునీటికి ఇబ్బందులు పడేవారు. వేసవిలో నీటి ట్యాంకర్ల సాయంతో పంటలను కాపాడుకునేవారు. ఈ పరిస్థితుల్లో ఎగువ ప్రాంత రైతులు పోరాటాలు చేసి అన్నమయ్య ప్రాజెక్టును సాధించుకున్నారు. దీంతో 20 ఏళ్లుగా ఈ ప్రాంతాలు సస్యశ్యామలమయ్యాయి. అయితే వారి ఆనందాన్ని వైసీపీ పాలకుల ఇసుక దాహం, ప్రకృతి ప్రకోపం ఏదైతేనేం ప్రాజెక్టు కొట్టుకుపోయి అన్నమయ్య కాలువ అలంకారప్రాయంగా మారింది.

గత ఏడాది డిసెంబరులో కురిసిన వర్షాల ఆధారంగా బోరుబావుల్లోని కొద్దిపాటి నీటితో సుమారు 5 వేల ఎకరాల్లో అరటి, బొప్పాయి తదితర వాణిజ్య పంటలను సాగు చేశారు. పంటలు వివిధ దశల్లో ఉండగానే వేసవి మొదలైంది. ఫిబ్రవరి నుంచే ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో భూగర్భజలం ఇంకిపోతోంది. మరో నెల రోజుల్లో బోర్లు ఎండిపోయే అవకాశం ఉంది. దీంతో ఏప్రిల్, మే నెలల్లో పంటలకు నీరందే అవకాశం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రత్యేక ప్యాకేజీ, సబ్సిడీ రుణాలు అందజేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. వచ్చే వర్షాకాలం నాటికైనా చెయ్యేరులో మోటార్లు ఏర్పాటు చేసి కాలువకు నీరందిస్తే తిరిగి ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని రైతులు చెబుతున్నారు.

లిఫ్టు ఇరిగేషన్ ఏర్పాటు చేయాలి



ఇప్పటి పరిస్థితుల్లో ప్రాజెక్టును పునరుద్ధరించే అవకాశాలు లేకపోవడంతో ప్రాజెక్టు ఉన్న ప్రాంతంలో చెయ్యేటిలో బోర్లు వేసి మోటార్ల ద్వారా అన్నమయ్య ప్రాజెక్టు కాలువకు నీరు అందిస్తే పొలాలన్నీ సస్యశ్యామలం అవుతాయి. ప్రాజెక్టు తెగిపోయిన ప్రాంతంలో సుమారు 110 అడుగుల లోతు వరకు కాంక్రీట్ వాల్ ఉండడంతో భూగర్భజలం పుష్కలంగా ఉంది. ఇక్కడి నుంచే రాజంపేట పట్టణానికి నీరందిస్తున్నారు.

- సుబ్రమణ్యంనాయుడు, రైతు, మిట్టమీదపల్లె

ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాలి..



ప్రాజెక్టుకు ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. చెయ్యేరు నదిలో ప్రతి ఐదు కిలోమీటర్లకు ఒక చెక్‌డ్యాంను నిర్మించి వర్షాకాలంలో నీటిని నిలువ చేసి లిఫ్టు ఇరిగేషన్ పథకాలను ప్రవేశపెట్టి ఆయకట్టు రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- రవినాయుడు, కూచివారిపల్లె

వీరభద్రాలయంలో మహానైవేద్యాన్ని కుప్పగా పోసిన దృశ్యం



మహా నైవేద్యం.. మహదానందభరితం

- అట్టహాసంగా అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం
- కనుల పండువగా రథోత్సవం

రాయచోటిటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని వీరభద్రాలయంలో వీరభద్రుడి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగానే 8వ రోజు ఆదివారం తెల్లవారుజామున వీరశైవ ఆగమ ఆచారం ప్రకారం భక్తిశ్రద్ధలతో రుద్రహోమాన్ని నిర్వహించారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశ కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం 11.45 గంటలు వీరభద్రుడి మహానైవేద్య ఘట్టం జరిగింది. సాయంత్రం 4 నుంచి కన్నుల పండువగా రథోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు చుట్టు ప్రక్కల ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బ్రహ్మోత్సవాల సందర్భంగా వీరభద్రాలయానికి వస్తున్న భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం భోజనం, సాయంత్రం భోజన వసతిని ఏర్పాటు చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో అవసరమైన ఏర్పాట్లను చేపట్టారు.



రాయచోటి పట్టణ వీధుల్లో వీరభద్రుడి రథోత్సవం



మధ్యాహ్న భోజనంలో 'రాయలసీమ రుచులు'

- ట్రయల్ రన్‌గా ప్రారంభించిన కొత్త మెనూ
- వేసవి సెలవుల వరకూ పిల్లల నుంచి అభిప్రాయ సేకరణ
- వచ్చే ఏడాది తుది మెనూకు రూపకల్పన

కలికిరి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు వడ్డిస్తున్న పీఎం పోషణ డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో కొత్త మెనూపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. స్థానిక రుచులు, ప్రాంతీయ ఆహారపు అలవాట్లతో మధ్యాహ్న భోజనం విద్యార్థులకు సంతృప్తికరమైన ఆసక్తి కలిగే విధంగా మెనూ రూపొందించాలని విద్యా శాఖ కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చింది. దీనికి అనుగుణంగా రాష్ట్రంలోని 13 ఉమ్మడి జిల్లాలను ప్రాంతాల వారీగా నాలుగు జోన్లుగా విభజించి కొత్త మెనూను అమలు చేస్తున్నారు. మొదటి జోన్‌లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాలను చేర్చారు. రెండవ జోన్‌లో ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాలు, మూడవ జోన్‌లో గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, నాలుగవ జోన్ రాయలసీమలోని చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలును చేర్చారు. ఆయా జిల్లాల్లో ప్రజలు తింటున్న సంప్రదాయ వంటలను, భోజన పద్ధతులను మేళవించి ప్రాంతాలవారీ ఏకీకృత ఆహారాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. రాయలసీమ జిల్లాల్లోని భోజనాల రకాలను అధ్యయనం చేసి రోజువారీ వేర్వేరు వంటకాలను వడ్డించాలని సూచించారు. వాస్తవానికి ఈ పద్ధతి గత డిసెంబరు నుంచే అమల్లోకి తెచ్చినా కొత్త భోజనాల తయారీపై ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నందున వాటి రుచులు, విద్యార్థులు ఆసక్తి చూపిస్తున్న పదార్థాలపై అభిప్రాయ సేకరణ చేపడుతున్నారు. వేసవి సెలవుల వరకు ఈ కొత్త మెనూను వడ్డిస్తూ అన్నీ ఒక కొలిక్కి వచ్చాక వచ్చే వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు మక్కువ చూపించే రకాలకు ప్రాధాన్యతనిస్తూ తుది మెనూను ప్రకటించనున్నారు. ఈలోగా ఈ నాలుగు నెలలపాటు నూతన మెనూపై విద్యార్థుల అభిప్రాయాలను సేకరించనున్నారు.

ప్రస్తుత రాయలసీమ జోన్ మెనూ

రాయలసీమ నాలుగు జిల్లాలకు కలిపి ఒకే విధమైన రోజువారీ నిర్ణీత రకాలను ప్రస్తుతం వడ్డిస్తున్నారు.

సోమవారం : అన్నం, వెజిటెబుల్ కర్రీ, ఉడికించిన గుడ్డు, చిక్కీ
మంగళవారం : పులగం లేదా పులిహోర, వేరుశెనగ పల్లీల చట్నీ, ఉప్పు కారంతో ఉడికించిన గుడ్డు, రాగి జావా
బుధవారం : అన్నం, సాంబారు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
గురువారం : వెజిటబుల్ రైస్, గుడ్డు కూర, రాగి జావ
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, చిక్కీ
శనివారం : అన్నం, కందిపప్పు చారు, బెల్లం పొంగలి, రాగి జావ

ఇస్కాన్ భోజనంలో ఉడకని కోడి గుడ్డు


ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చాలా మండలాల్లో మధ్యాహ్న భోజనాన్ని హిందూ ధార్మిక సంస్థ ఇస్కాన్ సరఫరా చేస్తోంది. ఇస్కాన్‌కు చిన్న గొట్టిగల్లు, తిరుపతిలో కేంద్రీయ వంటశాలలున్నాయి. ప్రస్తుతం అన్నమయ్య జిల్లాకు సంబంధించి పీలేరు, కలికిరి, కేవీ పల్లె మండలంలో 8 పాఠశాలలు, కలకడ మండలంలో బాటవారిపల్లె పాఠశాలకు మధ్యాహ్న భోజనం సరఫరా చేస్తోంది. జిల్లాలోని మిగతా అన్ని పాఠశాలల్లోనూ స్థానిక పాఠశాలల్లో భోజనం తయారు చేస్తున్నారు. ఇస్కాన్ నిబంధనల ప్రకారం ఉడికించిన కోడి గుడ్లు సరఫరా చేయడం లేదు. అయితే కోడి గుడ్లు ఆయా పాఠశాలలకు నేరుగా కాంట్రాక్టరు అందజేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో కోడిగుడ్లను విద్యార్థులు ఇళ్లకు తీసుకెళుతుండగా కొన్ని పాఠశాలల్లో అక్కడే ఉడికించి అందజేస్తున్నారు.



శేషాచలం కొండల్లో బయటపడిన సముద్ర శిలాజాలు

శేషాచలం కొండల్లో సముద్ర జీవుల శిలాజాలు..!

- ఔత్సాహికుల కృషితో వెలుగులోకి..



రైల్వేకోడూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): శేషాచలం కొండల్లో సముద్ర జీవుల శిలాజాలను ప్రకృతి ఔత్సాహికుడు పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.గోవిందరాజభాస్కర్ కనుగొన్నారు. క్వార్ట్జైట్, షెల్ శిలలతో ఏర్పడిన ఈ కొండల్లో తాజాగా లభించిన సముద్ర జీవుల శిలాజాలు, ఈ కొండలు ఒకప్పుడు సముద్ర గర్భంలో ఉన్నాయని సూచిస్తున్నాయి. ఈ విషయం శేషాచల కొండల భౌగోళిక ప్రాముఖ్యతకు మరో కొత్త అధ్యాయాన్ని జోడిస్తోంది. రాతి పొరలలో నిక్షిప్తమైన ఈ శిలాజాల వివరాలు వాటిని గుర్తించిన డాక్టర్ ఎం.గోవిందరాజభాస్కర్ వివరించారు.

శేషాచలం కొండల్లో సముద్ర జీవుల శిలాజాలు ఉండడం.. ఈ ప్రాంతం ఒకప్పుడు సముద్రానికి దిగువన ఉండేదనడానికి బలమైన సాక్ష్యం. ఈ విషయం దక్షిణ భారతదేశంలోని ప్రాచీన వాతావరణ పరిస్థితులు, భౌగోళిక పరిణామాలను అర్థం చేసుకోవడంలో కీలకంగా మారుతోంది. కార్బన్ డేటింగ్, స్ట్రాటిగ్రాఫిక్ విశ్లేషణల వంటి తదుపరి అధ్యయనాలు, ఈ ప్రాంతం సముద్ర వాతావరణం నుంచి ప్రస్తుత భౌగోళిక రూపానికి మారిన విధానానికి సంబంధించి స్పష్టమైన కాలక్రమాన్ని వెల్లడించగలవని నిపుణులు భావిస్తున్నారు. ఈ శేషాచల కొండలు ఇప్పటికే పురాతన దేవాలయాలతో వైవిధ్యమైన వృక్ష సంపదతో బయోస్పియర్ రిజర్వుగా విశేష గుర్తింపు పొందాయి. తాజాగా గుర్తించిన అంశాలు మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు శాస్త్రవేత్తలు, చరిత్రకారుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ ప్రాంతంలో మరిన్ని సముద్ర శిలాజాల ఉనికిని నిర్ధారించేందుకు పరిశోధక బృందం మరిన్ని పరిశోధనలకు యోచిస్తోంది.

అద్భుతమైన ఆనవాళ్లు..



శేషాచల కొండల్లో అద్భుతమైన ఆనవాళ్లు ఉన్నాయి. ఈ కొండల్లో పురాతనమైన ఆలయాలతో పాటు వృక్ష సంపద ఉంది. మరిన్ని పరిశోధనలు జరిగితే చాలా విషయాలు వెలుగు చూసే అవకాశాలు మెండుగా ఉంటాయి.

- డాక్టర్ ఎం.గోవిందరాజభాస్కర్, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్థకశాఖ

శిలాజాలపై భవిష్యత్ తరాలకు అవగాహన



శేషాచలం అడవులు అనేక నిగూఢ రహస్యాలను కలిగి ఉన్నాయి. వీటిపై మరింత లోతుగా పరిశోధనలు చేస్తే, మిలియన్ సంవత్సరాల క్రితం ఏర్పడిన ఈ కొండల విశేషాలను భవిష్యత్ తరాలకు అందించవచ్చు.

- ప్రభాకరరెడ్డి, రేంజర్, బాలపల్లె

భక్తులతో కిటకిటలాడిన రెడ్డెమ్మకొండ



ప్రత్యేక అలంకరణలో రెడ్డెమ్మ అమ్మవారు

గుర్రంకొండ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయంలో అమ్మవారు సంతాన లక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఉదయం అమ్మవారికి అర్చనలు, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంతానం లేని దంపతులు ఆకు పసురు తాగి కోనేరులో మునిగి అమ్మవారి ఆలయంలో వరపడ్డారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టింటికి చేరిన గంగమ్మ

- ముగిసిన జాతర
- కిక్కిరిసిన భక్తులు



7

చక్కెర లేదు.. పప్పూ రాదు..!

- చౌకదుకాణాల్లో బియ్యంతో సరి
- ఎండీయూలకు కార్డుదారుల సెగ

మదనపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చౌకదుకాణాల ద్వారా పేదలకు సబ్సిడీతో ఇస్తున్న చక్కెర సరఫరాకు కూడా బ్రేక్ పడింది. ఫిబ్రవరి నెలలో కందిపప్పు ఆపేయగా, తాజాగా మార్చి నెలకు సంబంధించి చక్కెర ఆగిపోయింది. దీంతో ఈనెలలో కార్డుదారులకు అటు కందిపప్పు, ఇటు చక్కెర కూడా లేనట్లయింది. రేషన్ కార్డుదారులకు కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖకు సబ్సిడీ సరుకులు సరఫరా చేయడానికి ప్రభుత్వం ఏటా టెండర్లు ఆహ్వానిస్తుంది. ఇందులో రెండు వేర్వేరు కాంట్రాక్టు సంస్థలు వీటిని సమకూర్చడానికి టెండర్ దక్కించుకున్నాయి. సాధారణంగా ఏడాది పాటు అగ్రిమెంట్‌తో సాగే ఈ వ్యవహారం ఈ ఆర్థిక సంవత్సరానికి ముగుస్తుంది. ఇప్పటికే సరఫరా చేసిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వం డబ్బులు చెల్లించకపోవడంతో కందిపప్పు, చక్కెర సరఫరాను నిలిపేసినట్లు చెబుతన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లో కందిపప్పు మూడునెలలు, చక్కెర ఆరు నెలలు నెలలు పంపిణీ చేయగా ప్రస్తుతం బియ్యంతో సరిపెట్టుకుంది. అయితే ఇప్పటికే ఉన్న స్టాకు గోదాము నిండుకోవడం, పైనుంచి స్టేజ్-1 పాయింట్‌కు స్టాకు రాకపోవడంతో అధికారులు కూడా తామేమీ చేయలేమని చెబుతున్నారు. జిల్లాలోని మదనపల్లె, రాయచోటి, రాజంపేట డివిజన్‌లలోని 30 మండలాలు, మూడు మున్సిపాలిటీలు, బి.కొత్తకోట నగర పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 1,126 చౌకదుకాణాల పరిధిలో 4,98,092 రేషన్‌కార్డులు ఉన్నాయి. అయితే ప్రతినెలా కార్డులోని యూనిట్లతో సంబంధం లేకుండా కిలో కందిపప్పు, అరకిలో చక్కెర పంపిణీ చేస్తున్నారు. గోదాముల్లో అందుబాటులో ఉన్న కందిపప్పును అంగన్‌వాడీలకు సరఫరా చేయగా, రెగ్యులర్ కార్డుదారులకు నిలిపేశారు. ఫిబ్రవరిలో కందిపప్పు ఆపేయగా, ఇప్పుడు చక్కెర కూడా ఆపేశారా? అంటూ రెండు రోజులుగా బియ్యం పంపిణీ చేస్తున్న ఎండీయూ వాహనదారులను కార్డుదారులు ప్రశ్నిస్తున్నారు. సరకుల సరఫరాలో అటు కార్డుదారులు, ఇటు ఎండీయూల మధ్య అక్కడక్కడ వాగ్వాదం చోటుచేసుకుంటోంది.



రంజాన్ వేళలు



	ఇఫ్తార్ (సోమవారం సాయంత్రం)	సెహరీ (మంగళవారం ఉదయం)
రాయచోటి	6.24	5.19
మదనపల్లె	6.29	5.16
రాజంపేట	6.26	5.17
పీలేరు	6.27	5.09

పుట్టింటికి చేరిన గంగమ్మ

● ముగిసిన జాతర ● కిక్కిరిసిన భక్తులు ● అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు


గంగమ్మ అమ్మవారు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పేరెన్నికగన్న అనంతపురం గంగమ్మజాతర ఆదివారం అమ్మవారు పుట్టింటికి చేరుకోవడంతో ముగిసింది. ఆదివారం మైలుతిరుణాల రెండవ రోజు లక్షల సంఖ్య లో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.మొదటి నిండు తిరుణాల శనివారం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా కనిపించింది. శనివారం అర్ధ రాత్రి 10 గంటల నుంచి భక్తుల రద్దీ పెరగడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. జాతర ప్రాంగణమంతా భక్తులతో కిటకిలాడింది. శనివారం రాత్రి 12 గంటల నుంచి అమ్మవారు ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న వారు కుంకుమ, చాందినీ బండ్లతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈవో అధికారి శ్రీనివాసులు, మంత్రి మండిపల్లె రాంప్రసాదు రెడ్డి, యువజన కమిటీ మండిపల్లె లక్ష్మీప్రసాదు రెడ్డి పర్యవేక్షించారు. బాలయ్యగారిపల్లెకు చెందిన కానాల గంగిరెడ్డి అన్నదానం చేశారు.శనివారం రాత్రి కర్ణాటకకు చెందిన మహిళలు అ డప్పు కళాకారులు అద్భుతంగా డప్పులు వాయించారు. చెక్క భజన, రేలారేలా, జబర్దస్త్, ఢీ జోడీ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివారం మైలు తిరునాళ రోజు అమ్మవారు తన పుట్టినిల్లైన కుర్నూతల చాగలగుట్టపల్లెకు వెళ్లిపోగానే జాతర ముగిసింది.



జాతరలో జనసందోహం (ఇన్‌సర్ట్) అమ్మవారికి బోనం సమర్పిస్తున్న బాలిక

అమ్మవారి సన్నిధిలో వీఐపీలు

శనివారం రాత్రి రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి, మండిపల్లె నాగిరెడ్డి, చిట్టి, అన్నమయ్య జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ దంపతులు, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు, కడప మేయర్ సురేష్‌బాబు, ఆర్డీవో శ్రీనివాసులు , ఏఎస్పీ వెంకటాద్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు, దినేష్,ఆలయ ఈవో శ్రీనివాసులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సన్మానం చేశారు.

చెరుకులకు డిమాండ్

అమ్మవారి దర్శనం అనంతరం భక్తులు చెరుకుల కొనుగోలుకు ఎగబడడంతో ఆయా ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. ఈ జాతరకు సుమారు 4 లక్షల మంది భక్తులు రాగా, కనీసం 2 లక్షల మంది చెరుకులు కొనుగోలు చేసి ఉంటారని అంచనా.

అంధుల అక్షర ప్రదాత లూయిూ బ్రెయిలీ


బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు

వాల్మీకిపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అంధులకు అక్షర ప్రదాత సర్ లూయిూ బ్రెయిలీ అని రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వాల్మీకిపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో లూయిూ బ్రెయిలీ విగ్రహావిష్కరణలో ఆయన మాట్లాడుతూ ఆయన రూ పొందించిన లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు.

స్థానిక గ్రంథాలయంలో అంధుల సౌకర్యార్థం బ్రెయిలీ పుస్తక విభాగం ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ఏపీ గ్రంథాలయాల డైరెక్టర్ కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు రవీంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, సబితరాణి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, లైబ్రేరియన్ పసుపులేటి రమాపతి, హెచ్‌ఎం శ్రీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ గోవింద్, సభ్యులు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన అంధులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే జరిమానా..


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ జావేద్

కడప క్రైం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారికి 1వ తేదీనుంచే కొత్త జరిమానాలు అమలులోకి వచ్చాయని కడప ట్రాఫిక్ సీఐ జావేద్ తెలిపారు. నగరంలోని రైతు బజార్ సర్కిల్ వద్ద ఆదివారం వాహనదారులకు అవగాహన కల్పించారు. లైసెన్స్ లేకుంటే రూ. 5వేలు, మద్యం తాగి నడిపితే రూ.10వేలు, హెల్మెట్ లేకుంటే రూ వెయ్యి, లేదా 3 నెలలు లైసెన్స్ రద్దు, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్‌కు రూ.1500, రెండవ సారి దొరికితే రూ 10వేలు. ఇన్సూరెన్స్ లేకుంటే రూ. 2000, రెండవ సారి అయితే 4వేలు విధిస్తామన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బండతో కొట్టి కాపలాదారు హత్య


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సిమెంటు బస్తాలకు కాపలాగా ఉన్న వ్యక్తి హత్యకు గురైనట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముద్దినేని వడ్డెపల్లెకు చెందిన తిరుపతి వారాది (77) అనే వ్యక్తి వడ్డిపల్లె క్రాస్ రోడ్డు వద్ద ఉన్న గంగమ్మ ఆలయంలో నిల్వ చేసిన సిమెంటు బస్తాలకు కాపలాగా శనివారం రాత్రి అక్కడ నిద్రించాడు. ఆదివారం ఉదయం ఆలయ పూజారి రక్తపు మడుగులో పడి ఉన్న అతని మృతదేహాన్ని గుర్తించి గ్రామస్తులకు సమాచారం అందజేశాడు. వారి ఫిర్యాదు మేరకు సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులు బండరాతితో అతని తలపై కొట్టి హత్య చేసినట్లు గుర్తించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. ప్రమాద స్థలం నుంచి వడ్డెపల్లె వరకు వెళ్లిన కుక్కలు అక్కడి నుంచి వెనుదిరిగినట్లు సమాచారం. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఈ కేసులో నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్, పోలీసు అధికారులను ఆదేశించారు. సంఘటన స్థలాన్ని పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

ఆస్తి కోసం వృద్ధుడిపై విష ప్రయోగం


చికిత్స పొందుతున్న సుగాలి చిన్నబిడ్డ

మదనపల్లె అర్బన్/కురుబలకోట, మార్చి2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం సొంత తమ్ముడి కుటుంబ సభ్యులు ఓ వృద్ధుడికి క్రిమి సంహారక మందు తాగించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కురుబలకోట మండలం, తెట్టు గ్రామానికి చెందిన సుగాలి చిన్నబిడ్డ అనే వృద్ధుడు తన పేరిట ఉన్న 0.35 సెంట్ల డీకేటీ భూమి ఉంది. ఆ భూమిని తన కోడలు రమణమ్మ పేరిట మార్చాలంటూ అందుకు సంబంధించిన పత్రాలతోపాటు, ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు నగదును తన తమ్ముడి కుమారుడు నరసింహులు నాయక్‌కు ఇచ్చాడు. అయితే, నరసింహులు నాయక్ ఆ పత్రాల ఆధారంగా తన భార్య శారద బాయి పేరుతో ఓసారి, సుందరబాయి అనే పేరుతో మరోసారి నకిలీ పత్రాలను సృష్టించుకున్నాడు, ఈ విషయమై కొన్ని రోజులుగా రెండు కుటుంబాల మధ్య చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం నరసింహులు నాయక్ తన పెదనాన్నను ఇంటికి పిలిచి దాడి చేయడంతోపాటు, తన తమ్ముడు వెంకటరమణ నాయక్, భార్య శారదబాయితో కలసి క్రిమి సంహారక మందు కలిపిన మద్యాన్ని బలవంతంగా తాగించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు అపస్మారక స్థితిలో పడిఉన్న వృద్ధుడిని స్థానికులు 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దతిప్పసముద్రం ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు. గత నెల 21న తన ఇంట్లో చోరీ జరిగినట్లు బూచిపల్లె వాసి బసప్పగారి వినాయకం పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఇదే గ్రామానికి చెందిన సతీష్‌ను నిందితుడిగా గుర్తించారు. ఎవరూ లేని సమయంలో వినాయకం ఇంట్లోకి ప్రవేశించిన సతీష్ బీరువా తాళాలు తీసి నగలు అపహరించాడు. కానగమాకులపల్లె వద్ద ఉన్న సతీశ్‌ను ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ల్యాప్‌టాప్ అప్పగింత


బ్యాగును మురళికి అప్పగించిన సీఐ ఓబులేసు

కడప(క్రైం), మార్చి 2 (ఆంధ్రజ్యోతి):ఆటోలో పోగొట్టుకున్న ల్యాప్‌టాప్‌ను చిన్నచౌకు పోలీసులు దాని యజమానికి అప్పగించారు. మాచర్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మురళి ఆది వారం కడపకు వచ్చాడు. ఆటోలో అప్సరా సర్కిల్ వద్దకు వచ్చిన ఆయన హడావుడిగా ఆటో దిగి వెళ్లిపోయాడు. కొద్దిదూరం వెళ్లాక ల్యాప్‌టాప్ బ్యాగును ఆటోలో మరచిపోయినట్లు గమనించి, చిన్నచౌకు సీఐ ఓబులేసును ఆశ్రయించారు. ఆయన ఆదేశాల మేరకు సీసీ ఫుటేజ్ ద్వారా ఆటో ఆచూకీని పోలీసు సిబ్బంది గుర్తించారు. ల్యాప్‌టాప్ బ్యాగును స్వాధీనం చేసుకుని దాని యజమానికి అప్పగించారు.

కుమారుడు కన్పించలేదని ఫిర్యాదు

పోరుమామిళ్ళ మార్చి2 (ఆంధ్రజ్యోతి):తమ కుమారుడు కనిపించడం లేదని కొట్టాలపల్లెకు చెందిన మండేల రామయ్య ఫిర్యాదు చేశాడని ఏఎస్‌ఐ రమేష్ తెలిపారు.తన కుమారుడు వెంకటరామయ్య కనిపించకపోవడంతో నెల రోజులుగా బంధువులు, స్నేహితుల వద్ద విచారించామని, ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేశారు. ఏఎస్‌ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే పోరుమామిళ్ళ పరిసర ప్రాంతాలలో, పబ్లిక్ స్థలంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదగాలి

● మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

మదనపల్లె అర్బన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఆర్థిక ఎదుగుదలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం నిర్వహించాలని మాజీ ఎంపీ టీజీ వెంకటేశ్ సూచించారు. ఆదివారం స్థానిక కన్యకా పరమేశ్వరి ఆలయ కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ఆయన ఆర్యవైశ్య హాస్టల్‌లో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు రాజకీయంగా ఎదగడానికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. టీటీడీలో ఆర్యవైశ్యుల కోసం మండపం ఏర్పాటు చేయాలని కోరారు. రాజ్యాంగం ప్రకారం ఆర్యవైశ్యులు జనరల్ కేటగిరీలో ఉన్నారని ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు ఏమీ రావన్నారు. వృత్తిని బట్టి కులాలు ఏర్పాటు చేశారని, వృతిపరంగా ఆర్యవైశ్యులు వ్యాపారులే అని చెప్పారు. ప్రస్తుతం వృత్తులు మరుగున పడిపోయాయని వివరించారు. రాజకీయంగా ముందుకు వెళ్లడానికి అన్ని వర్గాల వారి సహకారం అందుకోవాలన్నారు. మదనపల్లెలో ఏదైనా యూనిట్ పెట్టడానికి తనవంతుగా కోటి రూపాయలు సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటుకు తన తనయుడు కృషి చేస్తాడని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. గతంలో కూడా వారికి నామినేటెట్ పోస్టుల్లో అవకాశం కల్పించామని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, నేతలు నరసింహులు, మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, దేవతా సతీష్, సూరేగిరిధర్, బీజేపీ రాజంపేట జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయం

నిమ్మనపల్లి మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైతుల శ్రేయస్సే సహకార సంఘాల ధ్యేయమని అన్నమయ్య జిల్లా సహకార సంఘ శాఖాధికారి గురుప్రకాష్ తెలిపారు. ఆదివారం స్థానిక బెంగళూరు రోడ్డులోని కార్యాలయంలో నిర్వహించిన సహకార వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వున్న సహకార సంఘాల్లోని రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని అన్ని సేవలను అందిస్తున్నట్లు తెలిపారు.
మహిళా సహకార యోజన, రైతులకు పంటలపై అవగాహన, మహిళా సమాఖ్యకు సొసైటీ బ్యాంకు ద్వారా అందించే ఋణాలు, డీసీసీబీ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్‌పై అవగాహన, కో-ఆపరేటివ్ బ్యాంకు ద్వారా చేనేత కార్మికులకు రుణాలు, ఫిషరింగ్‌పై అవగాహన, విద్యార్థుల చదువుకు ప్రోత్సాహం, వన మహోత్సవం వంటి కార్యక్రమాలను దిగ్విజయంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పలు సంఘాలను ఇప్పటికే కంప్యూటరైజ్ చేశామని, వీటితోపాటు జనఔషధి కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎసీఎల్‌డీసీ శ్యాంప్రకాష్, అన్నమయ్య జిల్లా ఎస్‌డీఎల్‌సీఓ ఆనంద్, అచ్యుతాదేవి, ప్రకాష్‌కుమార్ సీఈఓ హరినాథ్‌రెడ్డి, రఘునాథ్ రెడ్డి సహచర సిబ్బంది దీప, స్వర్ణలత పాల్గొన్నారు.

తండ్రిని పరామర్శించి వస్తూ తిరిగిరాని లోకాలకు..

● రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి.. భర్తకు తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన శారద
తీవ్రంగా గాయపడిన మాధవరెడ్డి

వాల్మీకిపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని పరామర్శించి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కురబల కోట మండలం ముదివేడు గ్రామ పంచాయతీ అడవిపల్లెకు చెందిన శారద శనివారం తన భర్త మాధవరెడ్డితో కలిసి తిరుపతి రుయా ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి చంద్రశేఖర్‌రెడ్డిని చూసేందుకు వెళ్లింది. అదే రోజు రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా విఠలం సమీపాన వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శారద మృతి చెందగా భర్త మాధవ రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మాధవరెడ్డిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లెకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని ఒకరి మృతి


సుధాకర్ (ఫైల్)

రాయచోటిటౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు కలకడ మండలం ఎనుగొండ పాలెం గ్రామం దిగువపాలేనికి చెందిన సుధాకర్ (50) పండ్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటుంటాడు. నిమ్మ కాయల కొనుగోలుకు ఆదివారం రాయ చోటికి వచ్చిన ఆయన స్వగ్రామానికి తిరిగి వెళు తుం డగా పట్టణ పరిధిలోని చిత్తూరు రింగు రోడ్డుకు సమీపంలో కారు ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయనను స్థానికులు రాయచోటి ఏరియా ఆస్ప త్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు..

విద్యుదాఘాతంతో ఒకరు..


నీటిలో నాగరాజు మృతదేహం

బ్రహ్మంగారిమఠం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్ తగిలి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్త బస్వాపురంలో ఆదివారం చోటుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు కొత్త బస్వాపురం గ్రామానికి చెందిన తొర్రివేముల నాగరాజు (30) ఆదివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో బ్రహ్మసాగర్ ప్రాజెక్టుకు సమీపాన వాగులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. అక్కడి వంకకు దగ్గరలోని పొలం వద్ద అడవి పందుల కోసం ఏర్పాటు చేసిన కరెంటు తీగలు తగిలి మృత్యువాత పడ్డాడు. ఏఎస్‌ఐ గురప్ప విచారణ చేస్తున్నారు.

అత్త,మామపై అల్లుడి పైశాచిక దాడి


చికిత్స పొందుతున్న గంగాధర్, లక్ష్మీనరసమ్మ

పెద్దతిప్పసముద్రం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కన్నకూతురుని కొడుతున్న అల్లుడి బారి నుంచి అడ్డుకోబో యిన అత్తమామపై అల్లుడు పైశాచికంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితులు, స్థానికులు అం దించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలం బూచిపల్లెకు చెందిన గంగాధర్, లక్ష్మీనరసమ్మ దంపతులకు గాయత్రిని ఇదే గ్రామానికి చెందిన విజయ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నెల కూడా తిరగకుండానే గాయత్రిని అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అల్లుడు తన కూతురిని కొడుతుండగా మామ గంగాధర్, అత్త లక్ష్మీనరసమ్మ వెళ్లి అడ్డుకున్నారు. కోపోద్రిక్తుడైన అల్లుడు వారిపై పైశాచిక దాడికి పాల్పడ్డాడు. మామకు ముక్కు కోసి తీవ్రంగా గాయపరచగా, అత్తకు కాళ్లు చేతులు విరిచి తీవ్రంగా గాయపరిచాడు. తీవ్రంగా గాయపడిన వీరిని కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె ఆస్పత్రి లో లక్ష్మీనరసమ్మకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుం బ సభ్యులు తెలిపారు. జరిగిన ఈ సంఘటనపై పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పొలం విషయంలో వివాదం..యువకుడిపై దాడి

పులివెందుల టౌన్ మార్చి 2, (ఆంధ్రజ్యోతి): పొలం గట్టు విషయమై ఘర్షణలో మణి కంఠ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన సాదక్ వల్లి, అక్కరమ్మ కొడవలితో దాడి చేశారు. మణికంఠ, సా ధక్ వలి మధ్య పొలం గట్టు విషయమై గతంలోకూడా ఘర్షణలు జరిగాయి. ఆదివారం పొలం వద్ద మట్టిని తోలకూడదని వారించినందుకు మణికంఠపై వారు కొడవలితో దాడి చేశారు. గాయాలపాలైన మణికంఠను చికిత్స కోసం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిం చారు.
ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నారాయణ వెల్లడించారు.

తూనికలు, కొలతల శాఖ దాడులు

● ఎండీయూ వాహన నిర్వాహకుడికి జరిమానా

మదనపల్లె, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్త ఇండ్లలోని అర్బన్ చౌకదుకాణం 44కు జరిమానా విధించారు. రేషన్‌కార్డుదారులకు బియ్యం తూకం కంటే తక్కువగా ఇస్తున్నారని ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి కొత్త ఇండ్లు, రంగారెడ్డి కాలనీల్లో మకాం వేసి పరిశీలించారు. ఇందులో 25కిలోలకు కిలో, 10కిలోలకు 300 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎండీయూ వాహన నిర్వాహకుడు చంద్రశేఖర్‌కు రూ.10 వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. ఈయన కార్డుదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, కొందరికి అన్ని సరుకులు ఇవ్వడం లేదని, చా లా మందికి బియ్యం బదులు డబ్బు ఇస్తున్నాడని ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఇన్‌స్పెక్టర్ నాగరాజు అధ్వర్యంలో దాడులు నిర్వహిం చి పట్టుకున్నారు. జగనన్న కాలనీ, మరో ప్రాంతంలోనూ రెండు ఎండీయూ వాహనాలపై తనిఖీ చేసే క్రమంలో అక్కడి నుంచి వెళ్ళిపోయాయని తెలిసిం ది. పట్టణంలోని మరో రెండు సెల్‌ఫోన్ దుకాణాలు, హార్డ్‌వేర్, స్వీట్ దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.40వేలు జరిమానా విధించారు. ఇందులో కంపెనీ పేరు, తయారీదారుడు, ఎమ్మార్పీ ధరలు లేకపోవడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారంపై తూనికలు, కొలతల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నా రు. నిబంధనల ప్రకారం గడువు ముగిసినా ఎండీయూ వాహనదారులు వేయింగ్ మిషన్లకు సీల్ వేయించుకోలేదని తెలిసింది. కొందరు ఎండీయూలే రేషన్ డీలర్ల అవతారమెత్తి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఇటీవల రాయచోటిలో జేసీ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని చర్చ జరిగినట్లు సమాచారం.

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

సంక్షిప్తం

నాగారపమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మ

సుండుపల్లె, మార్చి2(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలోని పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లె సమీపంలో వెలిసిన నాగారపమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పట్టువస్త్రాలను ఆలయ అర్చకులు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు అమ్మవారికి తలనీలాలను సమర్పించారు. భక్తులు టెంకాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బోనాలు సమర్పించి మామిడి తోటలో అన్నదానం ఏర్పాటు చేశారు.

రేణుకా ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

సిద్దవటం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా ఎల్లమ్మ దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయ పూజారి సుబ్బరాజు మాట్లాడుతూ అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



మాట్లాడుతున్న గంగాధర్

రైల్వేకోడూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు మాదరాజు గంగాధర్ కోరారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశాలకు రూ.25 వేలు వేతనం చెల్లించాలన్నారు. రికార్డులు ప్రభుత్వం సరఫరా చేయాలని, ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని, ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు యశోద, మౌనిక, విజయమ్మ, నాగరాణి పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం

నందలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలో వెలసిన బోలమల్లేశ్వరస్వామి కల్యాణం టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించారు. కల్యాణం కన్నులపండువగా జరిగింది. భక్తులు పెద్దఎత్తున పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

రూ.10 లక్షలతో శ్మశానవాటిక



శ్మశానవాటిక నిర్మాణానికి రిబ్బన్ కట్ చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మార్చి 2(ఆంధ్రజ్యోతి) :మండలంలోని మాధవరం-1 గ్రామంలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటుకు రూ.10 లక్షలతో గ్రామ సర్పంచ్ జానకి రామయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామానికి చెందిన కీ.శే కుప్పల వెంకటేశ్ జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు ఉప్పల బాబు, ఉప్పల మోహన్‌కుమార్ ఎన్ఆర్ఐ నిధులు ఏర్పాటు చేయనుండటం అభినందనీయమన్నారు. నియోజకవర్గ టీడీపీ కార్యదర్శి ఉప్పల వెంకటేశ్ మాట్లాడుతూ గ్రామంలో 35 సంవత్సరాలుగా హిందువులకు శ్మశాన వాటిక మండపం లేదన్నారు. 30వ వార్డు బూత్ కన్వీనర్ రామక్రిష్ణ, టీచర్ ఉప్పల వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

5న జాబ్ మేళా

రైల్వేకోడూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రిలయన్స్ డిజిటల్ కంపెనీలో ఈ నెల 5న ఉద్యోగాలకు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక గిరిజమ్మ వీధిలో ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ కే. పార్థసారధి ఆదివారం తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పల్లె పండగతో మారిన పంచాయతీ రూపు రేఖలు

● గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా నాయకుల పరుగులు

నియోజకవర్గంలోని మండల వివరాలు..

మండలం	మంజూరైన పనులు	పూర్తయిన పనులు	నిధులు
రైల్వేకోడూరు	49	37	5.09 కోట్లు
ఓబులవారిపల్లి	48	33	5.21 కోట్లు
చిట్వేలి	41	23	4.53 కోట్లు
పుల్లంపేట	28	17	1.81 కోట్లు
పెనగలూరు	24	13	2.47 కోట్లు



రైల్వేకోడూరు పట్టణం లక్ష్మీప్యారడైజ్ థియేటర్ వద్ద నిర్మిస్తున్న సీసీ రోడ్డు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో కకావికలమైన పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించడానికి కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల అభివృద్ధి పల్లె పండగ పేరుతో శ్రీకారం చుట్టారు. పల్లె పండుగ వారోత్సవాలను గత ఏడాది ఆగస్టు 23న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మైసూరివారిపల్లి పంచాయతీలో ప్రారంభించారు. దీనిపై రైల్వేకోడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ప్రత్యేక శ్రద్ధ చూపించి ఎక్కువ శాతం నిధులు తెప్పించారు. నియోజకవర్గంలోని రైల్వేకోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు పంచాయతీలకు రెండు దశల్లో 190 పనులకు రూ.19.11 కోట్ల నిధులు మంజూరు చేయించారు. కోడూరు మండలంలోని మైసూరివారిపల్లి, అనంతరాజుపేట పంచాయతీలో అధిక శాతం నిధులు, ఎక్కువ పనుతు తెచ్చారు.

పల్లె పండగతో మా గ్రామం దశదిశ మారింది



పల్లె పండగ ద్వారా మా గ్రామం దశదిశ మారంది. మా గ్రామంలో 13 పనులకు శ్రీకారం చుట్టారు. ఏడు పూర్తి చేశాం. మా గ్రామంలో ఎప్పుడూ లేని విధంగా డ్రైనేజీలను ఏర్పాటు చేశాం. దళితవాడ, అరుంధతీవాడ, శాంతినగర్, మైసూరి వారిపల్లెల్లో సీసీ రోడ్డు పనులను ప్రారంభించి ఏడు పనులను పూర్తి చేశాం. మినరల్ వాటర్ ప్లాంట్, హెల్త్ సెంటర్ భవనం, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తాం.

- కారుమంచి సంయుక్త, సర్పంచ్, మైసూరివారిపల్లి

సకాలంలో పనులను పూర్తి చేస్తాం



నియోజకవర్గంలో మంజూరైన పనులను 70 శాతం పూర్తి చేశాం. మిగిలిన పనులను వెంటనే ప్రారంభించాలని స్థానిక కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం. పనుల నాణ్యత నియంత్రణను అధికారులు పరిశీలించారు. సీసీ రోడ్డు పనులలో లోపాలు ఉంటే ఉపేక్షించేది లేదు.

- బాలసుబ్రమణ్యం, డీఈ, పంచాయతీ రాజ్ శాఖ



మైసూరివారిపల్లెలో నిర్మిస్తున్న డ్రైనేజీ



శెట్టిగుంటలో పూర్తయిన సీసీ రోడ్డు

అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తాం

● కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి



శాంతినగర్‌లో వాటర్‌ప్లాంట్‌కు భూమి పూజ చేస్తున్న ముక్కా

రైల్వేకోడూరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గంలో అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తామని టీడీపీ ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి తెలిపారు. ఆదివారం రైల్వేకోడూరు మండలంలోని శాంతినగర్‌లో రూ.7 లక్షల వ్యయంతో వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి చూసి గత ప్రభుత్వ నాయకులు ముక్కున వేలేసుకోవాలన్నారు. అలాగే శెట్టిగుంట దళితవాడలో రూ.24 లక్షల వ్యయంతో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు.

రంజాన్ రేషన్ సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న సొసైటీ సభ్యులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం 50 ముస్లిం కుటుంబాలకు రంజాన్ రేషన్ సరుకుల కిట్లను సొసైటీ చైర్మన్ షేక్ మస్తాన్ సాహెబ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ ఉపవాస దీక్షలుండే వారికి ఒక రైస్ బ్యాగ్, కందిపప్పు, నూనె, మంచిపప్పులు, శనిక్కాయపప్పులు, ఉల్లిగడ్డలు, గోధుమపిండి, చింతపండు వంటి 19 రకాల నిత్యావసర వస్తువులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. సొసైటీ సభ్యులు మహమ్మద్ బాషా, డ్రైవర్ బాషా, జామీయా మస్జిద్ అధ్యక్షుడు ముజీబ్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

సిద్దవటం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన సిద్దవటం ఎగువపేటలో వంతాటిపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య ఆదివారం మద్యం అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం రావడంతో అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అతని నుంచి 15 చీప్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో మొదటి బహుమతి



ప్రోత్సాహక బహుమతిని అందుకుంటున్న పృథ్వి

సుండుపల్లె, మార్చి2(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి అబాకస్ పోటీల్లో సుండుపల్లె మండలంలోని వశిష్ట స్కూల్ విద్యార్థి పృథ్వి మొదటి బహుమతి గెలుచుకున్నట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ రెడ్డెయ్యరాజు ఆదివారం పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ విశ్వం ఎడ్యుకేషనల్‌లో జరిగిన జాతీయ స్థాయి అబాకస్ (మ్యాథ్స్ టాలెంట్ టెస్‌లో) ఉత్తమ ప్రతిభను కనపరచి లోక్‌సత్తా నాయకుడు జయప్రకాశ్ నారాయణ చేతుల మీదుగా మొదటి బహుమతిని అందుకోవడం సంతోషదాయకంగా ఉందని పాఠశాల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే రూ.5 వేల నగదు బహుమతిని అందజేశారన్నారు.

'నీటిఎద్దడిని ఎదుర్కొంటాం'



మాధవరంలో పైపులైన్ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

సిద్దవటం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలో నీటి ఎద్దడిని ఎదుర్కొంటామని గ్రామ పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య అన్నారు. మాధవరం-1 పార్వతీపురం, రెడ్డివారివీధి, అలీనగర్, లక్ష్మీపురంలలో ప్రధాన మంచినీటి పైపులకు మరమ్మతు చేశారు. గ్రామంలో నీటి సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ప్రతిభ

ఓబులవారిపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మక్కా హైస్కూల్ విద్యార్థులు జోనల్ స్థాయి వేదిక్ మ్యాథ్స్ పోటీల్లో ప్రతిభ కనబరచినట్లు కరస్పాండెంట్ రాజశేఖర్ తెలిపారు. జోనల్ స్థాయిలో పాల్గొన్న 50 స్కూళ్లకు సంబంధించిన 300 మంది విద్యార్థుల్లో మొదటి, రెండవ బహుమతుల్లో విజేతలుగా నిలిచినట్లు ఆయన తెలిపారు.

విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు దిక్కెవ్వరు

ఎక్కడి వారికి అక్కడే వైద్యం అందించాలన్న గత వైసీపీ ప్రభుత్వ లక్ష్యం నీరుగారింది. విలేజ్ హెల్త్ క్లీనిక్‌లకు దిక్కులేకుండా పోయింది. నేటికీ చాలా కార్యాలయాల భవనాలు మొండిగోడలకే పరిమితం అయ్యాయి.ఒక్కో భవనానికి సుమారు రూ.30 లక్షల వ్యయంతో పనులు చేపట్టారు. సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో పునాదులకే పరిమితమయ్యాయి.



మొండి గోడలతో దర్శనమిస్తున్న భాగంపల్లిలో ఏర్పాటు చేసిన హెల్త్ క్లీనిక్

సుండుపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో గత ప్రభుత్వంలో 10 గ్రామ పంచాయతీల్లో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు నిర్మించడానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. అయితే నిర్మాణాలకు అనుమతులు ఇచ్చింది కానీ సకాలంలో నిధులు ఇవ్వకపోవడం, స్థానికంగా వైసీపీ నాయకులు విలేజ్ హెల్త్ క్లీనిక్‌ల నిర్మాణాలకు అడ్డుపడడం, భూవివాదాల కారణంగా మడితాడు-1, మడితాడు-2, చిన్నగొల్లపల్లి మూడు గ్రామ పంచాయతీల్లో నిర్మాణాలు ప్రారంభించలేదు. అయితే సొంతంవారిపల్లె, భాగంపల్లె, తిమ్మసముద్రం గ్రామ పంచాయతీల్లో ప్రారంభించారు. సకాలంలో నిధులు రాకపోవడమే ప్రారంభించపోవడానికి కారణమని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తి చేసినా ఫలితం శూన్యం

ముడుంపాడు, సుండుపల్లె-2, సుండుపల్లె-3, పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీలో విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు పూర్తి చేశారు. కానీ ప్రారంభానికి నోచుకోలేదు. కొన్నిచోట్ల నిధులు ఇవ్వలేదని, మరికొన్ని చోట్ల పూర్తి స్థాయిలో వసతులు ఇంకా కల్పించలేదని విలేజ్ క్లీనిక్‌కు తాళాలు వేసి ఉన్నారు. ఈడిగపల్లె సమీపంలో విలేజ్ హెల్త్ క్లీనిక్ నిర్మించారు. కిటికీలు, డోర్లు ఏర్పాటు, మరుగుదొడ్లు సుడుపల్లె-2 నిర్మించారు. కానీ తాళాలు వేసి ఉన్నారు. పూర్తి చేసిన హెల్త్ క్లీనిక్‌లను ప్రారంభించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సక్రమంగా వైద్య సిబ్బంది ఆయా గ్రామ పంచాయతీల్లో ఉండి రోగులకు మెరుగైన వైద్యం అందిస్తే మండల కేంద్రానికి ప్రజలు పరుగులు తీయాల్సిన అవసరం ఉండదని ఆయా గ్రామాల గ్రామస్తులు చెబుతున్నారు.

పూర్తయిన వాటిని ప్రారంభిస్తాం



పూర్తయిన హెల్త్ క్లీనిక్‌లను త్వరలో ప్రారంభిస్తాము. ఎక్కడ ఎన్ని పూర్తి అయ్యాయి. ఇంకెన్నీ పూర్తి కావాల్సి ఉంది. అనే విషయాలను విచారించి తెలుసుకొని పై అధికారుల ఆదేశాల మేరకు ప్రారంభించి హెల్త్ క్లీనిక్ ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందించేలా చూస్తాము.

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె



పూర్తి అయినా ప్రారంభానికి నోచుకోని రెడ్డివారిపల్లె హెల్త్ క్లీనిక్

జనరేటర్ వైర్లు తగిలి వ్యక్తికి తీవ్రగాయాలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి2 (ఆంధ్రజ్యోతి): అనంతపురం గంగమ్మజాతరలో ఆదివారం ఉదయం రఫి అనే వ్యక్తికి ప్రమాదవశాత్తూ జనరేటర్ వైర్లు తగిలి శరీరం కాలినట్లు ఎస్ఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు... రామాపురం మండలం సుద్దమల్ల గ్రామం దూదేకులపల్లెకు చెందిన పాలగిరి రఫి గంగమ్మజాతరకు వచ్చారు. అక్కడున్న జనరేటర్‌ను మద్యం మత్తులో పట్టుకున్నాడు. దీంతో గాయాల య్యాయి. వెంటనే పక్కనే ఉన్న వ్యక్తులు శరీరంపై నీళ్లు పోసి 108 ద్వారా లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కడప రిమ్స్‌కు తరలించారని ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

లూథరన్ చర్చి చైర్మన్‌కు ఘన సత్కారం



పాలెం భానును సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

రైల్వేకోడూరు రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఆటోనగర్ డెవలప్మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాలెం భాను కోడూరు పట్టణంలోని లూథరన్ చర్చి చైర్మన్ అయిన సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు మెదురు లోకనాథం ఆచారి ఆధ్వర్యంలో సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కేజీ.ప్రసాద్, మెహబూబ్ బాషా, ఎస్వీఎస్ మణి, గంగాధర్, కృష్ణ, కే.హరి పాల్గొన్నారు.

చెత్త వేరుచేసే విధానంపై అవగాహన



చెత్తపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీపీవో రాజ్యలక్ష్మి

సిద్దవటం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : తడిచెత్త, పొడిచెత్త వేరు చేసే విధానంపై జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి ఆదివారం అవగాహన కల్పించారు. మండలంలోని మేజర్ గ్రామ పంచాయతీలు సిద్దవటం, పెద్దపల్లె గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొడి చెత్త, తడిచెత్తను ఇంటివద్దే వేరుచేసి హరిత రాయబారులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ రాజేష్, హరిత రాయబారులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా బండలాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న మేడా రఘునాథ్‌రెడ్డి

నందలూరు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతకాయలపల్లెలో వెలసిన బోలమల్లేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా టంగుటూరు మాజీ సర్పంచ్ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. ఈ పోటీలను ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్‌రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. పోలిరెడ్డిపల్లెకు చెందిన త్యాగంరెడ్డి లింగారెడ్డి వృషభాలు మొదటి స్థానంలో నిలిచి రూ.30 వేల నగదు బహుమతిని మేడా రఘునాథ్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

గాలికుంటు వ్యాధిని నివారిద్దాం

చిన్నమండెం, మార్చి2(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధిని నివారిద్దామని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. పశుసంవర్థక శాఖ ఈ టీకా కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు పరుస్తోం దని జిల్లా పశు సంవర్థక శాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. పరమటికోనలో వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు.

క్రీడలతో శారీరక, మానసిక బలం: మంత్రి



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని రాష్ట్ర రవాణ, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు నెహ్రూ యువజన కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం రాయచోటి పట్టణంలోని నేతాజీ సర్కిల్ వద్ద గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో కూడా రాణించి జిల్లాకు, రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. విద్య మనకు ఎలా జ్ఞానాన్ని ఇచ్చి మెరుగుపరుస్తుందో అదే విధంగా క్రీడలు కూడా మన జీవితానికి ఎన్నో పాఠాలు నేర్పిస్తాయన్నారు. విద్యతో పాటు క్రీడలు కూడా మనలో భాగం అయినప్పుడు పరిపూర్ణతగల మనిషిగా అభివృద్ధి చెం దుతారన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాలను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఈ పోటీల్లో ఓడిపోయిన వారు నిరుత్సాహం చెందకుండా వచ్చే పోటీల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలన్నారు. క్రీడల్లో గెలుపోటములు సర్వసాధారణమన్నారు. అనంతరం జిల్లా స్థాయి పోటీల్లో గెలుపొందిన వారికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలు, మెడల్స్ ప్రదానం చేశారు.

విచారణ షురూ...

- సీఎంఓ ఆదేశాలతో ఆరు బృందాల నియామకం
- వైసీపీ భూఆక్రమణలపై సమగ్ర విచారణ
- ఆక్రమణదారుల గుండెల్లో గుబులు
- ఫలించిన నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పోరాటం

పీలేరు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో భూ ఆక్రమణలు పేట్రగిపోయాయి. తమను ఎవరూ ఏమీ చేయలేరని, అగ్ర నేతలు సహా స్థానిక నేతలు ధీమా ప్రదర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి భూఆక్రమణలపై అవిశ్రాంతంగా పోరాడారు. ఫలితంగా వైసీపీ ప్రభుత్వంలో పీలేరు మండలంలో జరిగిన భూఆక్రమణలపై కూటమి ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. చడీచప్పుడు లేకుండా విచారణ 84 మంది సభ్యులతో కూడిన ఆరు విచారణ బృందాలను నియమించింది. రానున్న 10 రోజుల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి అన్యాక్రాంతమైన ప్రభుత్వ, డీకేటీ భూములను పరిశీలించనున్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అందిన ఆదేశాలతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ శనివారం రాత్రి విచారణ బృందాలను ఎంపిక చేసుకుని ఆదివారం ఉదయం వాటిని పీలేరుకు పంపించారు. పీలేరు మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ, పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు ఆదివారం విచారణ బృందాలకు దిశానిర్దేశం చేశారు.


సర్వే బృందాలకు దిశానిర్దేశం చేస్తున్న ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ

సబ్‌కలెక్టర్ జాహ్నవి నివేదిక ఆధారంగా విచారణ

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మండలంలోని పీలేరు, దొడ్డిపల్లె, ఎర్రగుంటపల్లె, ముడుపులవేములు, గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె పంచాయతీల్లో పెద్దఎత్తున ప్రభుత్వ, డీకేటీ భూములు ఆక్రమణకు గురయ్యాయి. రియల్టర్ల అవతారం ఎత్తిన అనేక మంది వైసీపీ నేతలు ప్రభుత్వ, డీకేటీ భూములను ఆక్రమించుకుని వెంచర్లు వేసుకుని ఇంటి స్థలాలను అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. 2021లో వీటిపై అప్పట్లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పోరాటం ప్రారంభించారు. పీలేరులో జరిగిన భూఆక్రమణలపై పూర్తి సాంకేతిక ఆధారాలతో జిల్లా ఉన్నతాధికారులు, రాష్ట్ర హైకోర్టు, లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదులపై స్పందించిన లోకాయుక్త విచారణకు ఆదేశించింది. దీంతో అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా కలెక్టర్ హరినారాయణ, అప్పటి మదనపల్లె సబ్-కలెక్టర్ జాహ్నవిని విచారణ అధికారిగా నియమించారు. ఆమె నేతృత్వంలో సుమారు 80 మంది అధికారులు 10 బృందాలుగా విడిపోయి దాదాపు నెల రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదిక అందించారు. పీలేరు సహా పొరుగునే ఉన్న దొడ్డిపల్లె, ఎర్రగుంటపల్లె, ముడుపులవేములు, గూడరేవుపల్లె, బోడుమల్లువారిపల్లె పంచాయతీల్లో సుమారు రూ.400 కోట్లు విలువైన 600 ఎకరాల భూమి అన్యాక్రాంతమైనట్లు సబ్-కలెక్టర్ హోదాలో జాహ్నవి తన నివేదికను కలెక్టర్ హరినారాయణకు అందించారు. ప్రస్తుతం ఆ నివేదిక ఆధారంగా విచారణ బృందాలు తమ విచారణ ప్రారంభించినట్లు తెలిసింది.

ఆక్రమణదారులు, అప్పటి అధికారుల్లో ఆందోళన

సబ్-కలెక్టర్ జాహ్నవి నివేదిక ఆధారంగా 2022లో రాష్ట్ర సీసీఎల్ఏ పీలేరు మండలంలో పనిచేసిన 12 మంది రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంది. వారందరినీ సస్పెండ్ చేస్తూ, వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను ఆదేశించింది. అయితే అప్పటి అధికార పార్టీ నేతల అండదండలతో వారందరికీ బదిలీలతో సరిపెట్టారు. అంతేకాక ఆక్రమణల తొలగింపును కూడా అప్పటి వైసీపీ నేతలు అడ్డుకున్నారు. తొలగింపు చర్యలు చేపట్టిన సబ్-కలెక్టర్ జాహ్నవిని సైతం అడ్డుకుని తాత్కాలికంగా నిలిపేయ గలిగారు. ఇకపై ఎటువంటి చర్యలు ఉండబోవన్న ధీమాతో వారంతా మిన్నకుండి పోయారు. కొన్ని ఆక్రమణలను తరువాత కాలంలో జీఓ నెం.225 మేరకు రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరించారు కూడా. మరోమారు ఆక్రమణలపై విచారణ ప్రారంభమవడంతో అటు ఆక్రమణదారులు, ఇటు అప్పటి అధికారుల్లో ఆందోళన ప్రారంభమైంది. విచారణ అనంతరం ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనన్న భయం వారిని వెంటాడుతోంది.

నిష్పక్షపాతంగా విచారించండి

- ప్రత్యేక అధికారి రమ

విచారణ కోసం కలికిరి, తంబళ్లపల్లె, సంబేపల్లె, కురబలకోట మండలాల నుంచి పీలేరుకు వచ్చిన అధికారులతో ఆదివారం పీలేరు మండల ప్రత్యేక అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమ, పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు సమావేశమయ్యారు. తమకు నిర్దేశించిన ప్రాంతాలను విధిగా క్షేత్రస్థాయిలో సందర్శించి, రికార్డులు పరిశీలించి, ప్రస్తుతం అక్కడ ఎటువంటి పరిస్థితి ఉన్నదో నివేదించాలని వారికి సూచించారు.


బోడుమల్లువారిపల్లె పంచాయతీలో విచారిస్తున్న అధికారులు

అసెంబ్లీలో సమాధానం కోసమేనా....?

ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి పీలేరు ప్రాంత భూఆక్రమణలపై అసెంబ్లీలో ప్రశ్నలు లేవనెత్తనున్నారని, ఆయనకు సమాధానం చెప్పేందుకు ముఖ్యమంత్రి కార్యాలయం ఆ వివరాలు అడగడంతో ఆక్రమణలపై జిల్లా ఉన్నతాధికారులు హఠాత్తుగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి భూఆక్రమణలపై రాజీలేని పోరాటం చేస్తున్నారు. ఆయన ఫిర్యాదుల కారణంగా వైసీపీ ప్రభుత్వంలో విచారణ జరిగినా ఫలితం శూన్యమే. ప్రస్తుతం తమ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వాటిపై ఆయన మరోమారు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదగాలి

మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

మదనపల్లె అర్బన్, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులు ఆర్థికంగా ఎదుగుదలకు రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం నిర్వహించాలని సూచించారు. ఆదివారం స్థానిక కన్యకాపరమేశ్వరీదేవి ఆలయ కుంబాభిషేక మహోత్సవంలో పాల్గొన్న ఆయన ఆర్యవైశ్య హాస్టల్ లో మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ఆర్థికంగా మెరుగుపడడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారాలు నిర్వహించాలన్నారు. రాజకీయంగా ఎదగడానికి తనవంతు సహకారం అందిస్తానని భరోసా కల్పించారు. టీటీడీలో ఆర్యవైశ్యులు కోసం మండపం ఏర్పాటు చేయాలని, రాజ్యాంగం ప్రకారం ఆర్యవైశ్యులు జనరల్ కేటగిరీలో ఉన్నారని ప్రభుత్వం నుంచి సంక్షేమ ఫలాలు ఏమీ రావన్నారు. వృత్తిని బట్టే కులాలు ఏర్పాటు చేశారని, వృతిపరంగా ఆర్యవైశ్యులు వ్యాపారులే అని చెప్పారు. ప్రస్తుతం వృత్తులు మరుగున పడిపోయాయని వివరించారు. రాజకీయంగా ముందుకు వెళ్లడానికి అన్ని వర్గాల వారి సహకారం అందుకోవాలన్నారు. మదనపల్లెలో ఏదైనా యూనిట్ పెట్టడానికి తనవంతుగా కోటి రూపాయలు సాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమల ఏర్పాటు చేయడానికి తన తనయుడు కృషి చేస్తాడని తెలిపారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ ఆర్యవైశ్యులకు ఎప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. గతంలో కూడా వారికి నామినేటెట్ పోస్టుల్లో అవకాశం కల్పించామని గుర్తు చేశారు. టీటీడీ బోర్డు సభ్యులు భానుప్రకాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ నేత చల్లపల్లె నరసింహారెడ్డి, నేతలు నరసింహులు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పూనగంటి ఓంప్రకాష్, దేవతా సతీష్, సూరేగిరిధర్, బీజేపీ రాజంపేట జిల్లా ప్రధానకార్యదర్శి ఎల్లంపల్లె ప్రశాంత్, ఆర్యవైశ్య యువజన సంఘం సభ్యులు, మహిళా సంఘం సభ్యులు, ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ టీజీ వెంకటేష్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బి.కొత్తకోట, మార్చి2(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న అబ్దుల్‌కరీం మృతి చెందినట్లు సీఐ జీవన్‌గంగనాథ్‌బాబు తెలిపారు. బెంగళూరు రోడ్డులోని అబ్దుల్‌కరీం స్వగృహంలో స్నానం చేస్తుండగా గ్యాస్ గీజర్ లీక్ అవ్వడంతో మంటలు చలరేగాయి. వాటిని అదుపు చేసేందుకు ప్రయత్నించి తన శరీరానికి మంటలు వ్యాపించి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం బెంగళూరుకు తరలించగా పరిస్థితి విషమించడంతో మృతిచెందాడని మృతుడి కుమారుడు జమీల్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

బ్యానర్లకు అనుమతి తప్పనిసరి

బి.కొత్తకోట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బ్యానర్ల ఏర్పాటుకు, మైకుల ద్వారా ప్రకటనలకు ముందస్తు అనుమతులు తప్పక తీసుకోవాలని కమిషనర్ పల్లవి పేర్కొన్నారు. పట్టణంలో భద్రత, పబ్లిక్ ఆర్డర్ నిర్వహణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. పంచాయతీ అనుమతి లేకుండా ఫెక్సీలు కట్టినా, అనౌన్స్‌మెంట్లు చేసినా తగు చర్యలు తీసుకుని జరిమానా విధిస్తామన్నారు. పట్టణ వాసులు ఆస్తిపన్ను, వీఎల్‌టీ, నీటిపన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించి నగరపంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు.

అంధుల అక్షర ప్రదాత లూయీబ్రెయిలీ

వాల్మీకిపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): అంధులకు అక్షర ప్రదాత సర్ లూయీబ్రెయిలీ అని రాష్ట్ర గ్రంథాలయ అధ్యక్షుడు గోను గుంట్ల కోటేశ్వరరావు తెలిపారు. ఆదివారం వాల్మీకిపురం జడ్పీ బాలికోన్నత పాఠశాలలో లూయీస్‌బ్రెయిలీ విగ్రహావిష్కరణలో ఆయన మాట్లాడుతూ అంధుల కోసం ఆయన రూపొందించిన లిపితో అంధుల జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. గ్రంథాలయంలో అంధుల సౌకర్యార్థం బ్రెయిలీ పుస్తక విభాగం ఏర్పాటు చేయడం గర్వంగా ఉందన్నారు. ఏపీ గ్రంథాలయాల డైరెక్టర్ కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు రవీంద్ర బాబు, ప్రధాన కార్యదర్శి జలంధర్‌రెడ్డి, సబితరాణి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల వెంకటరమణ, లైబ్రేరియన్ పసుపులేటి రమాపతి, హెచ్‌ఎం శ్రీదేవి, స్కూల్ కమిటీ చైర్మన్ గోవింద్, సభ్యులు వివిధ ప్రాంతాల అంధులు పాల్గొన్నారు.


బ్రెయిలీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కోటేశ్వరరావు

హార్సిలీహిల్స్ స్కూల్ పూర్వవిద్యార్థుల కలయిక


హిల్స్‌లోని రెస్టారెంట్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

బి.కొత్తకోట, మార్చి 2(ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్ స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలిశారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 30 మంది హిల్స్‌కు చేరుకుని నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. కొండపైనున్న ఓ ప్రైవేటు రెస్టారెంట్‌లో ఆనందంగా గడిపారు. వీరిలో విజయవాడ మాజీ ఎంపీ కేసినేని నాని, మాజీ ఎమ్మెల్సీ సతీష్ రెడ్డి, పుంగనూరు శ్రీనాథ్‌రెడ్డి తదితరులు వున్నారు.

వంతెన నిర్మించి... సమస్యను పరిష్కరిస్తాం

- తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వంతెన నిర్మించి ఎండ్లపల్లె సమస్యను పరిష్కరిస్తామని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి హామీ ఇచ్చారు. మద్దినాయనిపల్లె పంచాయతీ ఎండ్లపల్లె వద్ద జరుగుతున్న హంద్రీ - నీవా కాంక్రీట్ లైనింగ్ పనులతో పొలాలకే కాక శ్మశానానికి సైతం దారి ఉండదని గ్రామస్తులు టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఆదివారం గ్రామానికి వెళ్లి సమస్యను పరిశీలించి గ్రామస్తులతో మాట్లాడారు. హంద్రీ - నీవా ఈఈ నీలకంఠారెడ్డి, డీఈ ప్రవీణ్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. రైతుల పొలాలకు వెళ్లేందుకు వంతెన నిర్మించి ఇక్కడ పనులు చేపట్టాలని సూచించడంతో అధికారులు సానుకూలంగా స్పందించారు. పాత చెరువు నుంచి పొలాల కు నీళ్లు వస్తున్న తూము హంద్రీ - నీవా పనులతో పూడిపోకుండా యధావిధిగా ఉండేందుకు మీటరు పైపు ఏర్పాటు చేయాలని ఆయన అధికారులకు తెలియజేశారు. బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ మంగరాజు, టీడీపీ నాయకులు మస్తాన్‌రెడ్డి తదితరులున్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

అత్త,మామపై అల్లుడి పైశాచిక దాడి

అత్తకు కాళ్లు చేతులు విరిచి..., మామకు ముక్కు కోసి గాయపరిచిన వైనం

పెద్దతిప్పసముద్రం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కన్నకూతురిని కొడుతున్న అల్లుడి బారి నుంచి అడ్డుకోబోయిన అత్త,మామపై అల్లుడు పైశాచికంగా దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. బాధితులు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం మండలం బూచిపల్లెకు చెందిన గంగాధర్, లక్ష్మీనరసమ్మ దంపతులకు గాయత్రిని ఇదే గ్రామానికి చెందిన విజయ్ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నెల కూడా తిరగకుండానే గాయత్రిని అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తుండేవాడు. ఈ నేపథ్యంలో ఆదివారం అల్లుడు తన కూతురిని కొడుతుండగా మామ గంగాధర్, అత్త లక్ష్మీనరసమ్మ వెళ్లి అడ్డుకున్నారు. కోపోద్రిక్తుడైన అల్లుడు వారిపై పైశాచిక దాడికి పాల్పడ్డాడు. మామకు ముక్కు కోసి తీవ్రంగా గాయపరచగా, అత్తకు కాళ్లు చేతులు విరిచాడు. తీవ్రంగా గాయపడిన వీరిని కుటుంబ సభ్యులు హుటాహుటిన మదనపల్లె ఏరియా ఆస్పత్రికి తరలించారు. మదనపల్లె ఆస్పత్రిలో లక్ష్మీనరసమ్మకు ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జరిగిన ఈ సంఘటనపై పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు పీటీఎం పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతున్న గంగాధర్, లక్ష్మీనరసమ్మ

ఆస్తి కోసం వృద్ధుడిపై హత్యాయత్నం

మదనపల్లె అర్బన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తమ్ముడి కుటుంబ సభ్యులు క్రిమిసంహారక మందు తాపించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కురుబలకోట మండలం, తెట్టు వాసి సుగాలి చిన్నబిడ్డ పేరిట 0.35 సెంట్ల డీకేటీ భూమి ఉంది. ఆ భూమిని తన కోడలు రమణమ్మ పేరిట మార్చాలంటూ పత్రాలు, ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలు నగదును తన తమ్ముడి కుమారుడు నరసింహులు నాయక్‌కు ఇచ్చాడు. నరసింహులు నాయక్ నకిలీ పత్రాలను సృష్టించుకున్నాడు. ఈ విషయమై రెండు కుటుంబాల మధ్య చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం నరసింహులు తన పెదనాన్నను ఇంటికి పిలిచి దాడి చేయడం, తన తమ్ముడు వెంకట రమణ నాయక్, భార్య శారదబాయితో కలిసి క్రిమి సంహారక మందు కలిపిన మద్యాన్ని బలవంతంగా తాపించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. వృద్ధుడిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్లు తిరుపతికి రెఫర్ చేశారు. కేసు నమోదు చేసుకున్నట్లు ముదివేడు పోలీసులు తెలిపారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి : ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో ఆయన మున్సిపల్, మండల పరిషత్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 35 వార్డులు, మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య వున్న ప్రాంతాలను గుర్తించి నీటి ఎద్దడి నివారణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద, ముస్లింలు నివశించే ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ, తాగునీటి సరఫరాపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. వీధి దీపాలు మరమ్మతులు చేయించి వెలిగేలా చూడాలన్నారు. మదనపల్లె, నిమ్మనపల్లె, రామసముద్రం ఎంపీడీఓలు పంచాయతీ కార్యదర్శులతో సమావేశాలు ఏర్పాటు చేసి సూచనలివ్వాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.

తండ్రిని పరామర్శించి వస్తూ తిరిగిరాని లోకాలకు..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి.. భర్తకు తీవ్ర గాయాలు

వాల్మీకిపురం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధ పడుతున్న తండ్రిని పరామర్శించి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా, ఆమె భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. కురబల కోట మండలం ముదివేడు పంచాయతీ అడవిపల్లె వాసి శారద శనివారం తన భర్త మాధవరెడ్డితో కలిసి తిరుపతి రుయా ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి చంద్రశేఖర్‌రెడ్డిని చూసేందుకు వెళ్లింది. రాత్రి స్వగ్రామానికి తిరిగి వస్తుండగా విఠలం సమీపాన వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో శారద మృతి చెందగా భర్త మాధవరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు మాధవరెడ్డిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మదనపల్లెకు తరలించారు.


శారద మృతదేహం

సేవే లక్ష్యంగా యువశక్తి ఫౌండేషన్

మదనపల్లె అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవలు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు నిర్వాహకుడు మోహన్, శివాజీ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సమాజంలోని ప్రతి ఒక్కరినీ చేరువ చేయడం కోసం కో కన్వీనర్‌గా శివాజీ ఎన్నుకున్నామన్నారు. వారు మాట్లాడుతూ ఫౌండేషన్ ఆశయాలను ముందుకు తీసుకుపోయి సమాజంలో యువతకు మరెంత సహాయ సహకారం అందడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రెడ్డి గణేష్, శివాజీ, శశికుమార్, నాగ, అమరనాథ్, గోవర్ధన్, మోక్షత్, చరణ్, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పుట్టింటికి చేరిన గంగమ్మ

- ముగిసిన జాతర ● కిక్కిరిసిన భక్తులు ● అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రాయలసీమలో పేరెన్నిక గన్న అనంతపురం గంగమ్మజాతర ఆదివారం అమ్మవారు పుట్టింటికి చేరుకోవడంతో ముగిసింది. ఆదివారం మైలతిరునాల రెండవ రోజు లక్షల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మొదటి నిం డు తిరునాల శనివారం కావడంతో భక్తుల రద్దీ తక్కువగా కనిపించింది. శనివారం అర్ధరాత్రి 10 గంటల నుంచి భక్తుల రద్దీ పెరగడంతో క్యూలైన్లు కిక్కిరిశాయి. జాత ర ప్రాంగణమంతా భక్తులతో కిటకిలాడింది. శనివారం రాత్రి 12 గంటల నుంచి అమ్మవారు ఊరేగింపు నిర్వహించారు. మొక్కుబడులు ఉన్న వారు కుంకుమ, చాందినీ బండ్లతో ఆలయ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు, ఈఓ అధికారి శ్రీనివాసులు, మంత్రి మం డిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, యువజన కమిటీ మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి పర్యవేక్షించారు. బాలయ్యగారిపల్లెకు చెందిన కానాల గంగిరెడ్డి అన్నదానం చేశారు.శనివారం రాత్రి కర్ణాటకకు చెం దిన మహిళలు అ డప్పు కళాకారులు అద్భుతంగా డప్పులు వాయించారు. చెక్కభజన, రేలారేలా, జబర్దస్త్, ఢీ జోడీ కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆదివా రం మైల తిరునాల రోజు అమ్మవారు తన పుట్టినిల్లైన కర్నూతల చాగలగుట్టపల్లెకు వెళ్లిపోగానే జాతర ముగిసింది.


జాతరలో జనసందోహం (ఇన్‌సర్ట్) అమ్మవారు

అమ్మవారి సన్నిధిలో వీఐపీలు

శనివారం రాత్రి రాష్ట్ర రోడ్డు రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, మండిపల్లె లక్ష్మీప్రసాద్ రెడ్డి, మండిపల్లె నాగిరెడ్డి, చిట్టి, కలెక్టర్ చామకూరి శ్రీధర్ దంపతులు, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు దంపతులు, కడప మేయర్ సురేష్ బాబు, ఆర్డీఓ శ్రీనివాసులు ,ఏఎస్పీ వెంకటాద్రి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు చెల్లు గంగరాజు, దినేష్,ఆలయ ఈఓ శ్రీనివాసు లు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి సన్మానం చేశారు.

తూనికలు, కొలతల శాఖ దాడులు

- ఎండీయూ వాహన నిర్వాహకుడికి జరిమానా
- పలు దుకాణాలపై దాడులు

మదనపల్లె, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మదనపల్లెలో తూనికలు, కొలతల శాఖ అధికారులు ఆదివారం వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా కొత్త ఇండ్లులోని అర్బన్ చౌకదుకాణం 44కు జరిమానా విధించారు. రేషన్‌కార్డుదారులకు బియ్యం తూకం కంటే తక్కువగా ఇస్తున్నారని ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఆదివారం ఉదయం నుంచి కొత్త ఇండ్లు, రంగారెడ్డి కాలనీల్లో మకాం వేసి పరిశీలించారు. ఇందులో 25కిలోలకు కిలో, 10కిలోలకు 300 గ్రాములు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. దీంతో ఎండీయూ వాహన నిర్వాహకుడు చంద్రశేఖర్‌కు రూ.10 వేలు అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. ఈయన కార్డుదారుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, కొందరికి అన్ని సరుకులు ఇవ్వడం లేదని, చాలా మందికి బియ్యం బదులు డబ్బు ఇస్తున్నాడని ఫిర్యాదులు అందినట్లు తెలిసింది. దీంతో జిల్లా ఇన్‌స్పెక్టర్ నాగరాజు అధ్వర్యంలో దాడులు నిర్వహించి పట్టుకున్నారు. జగనన్న కాలనీ, మరో ప్రాంతంలోనూ రెండు ఎండీయూ వాహనాలపై తనిఖీ చేసే క్రమంలో అక్కడి నుంచి వెళ్ళిపోయాయని తెలిసింది. పట్టణంలోని మరో రెండు సెల్‌ఫోన్ దుకాణాలు, హార్డ్‌వేర్, స్వీట్ దుకాణాలపై దాడులు నిర్వహించి రూ.40వేలు జరిమానా విధించారు. ఇందులో కంపెనీ పేరు, తయారీదారుడు, ఎమ్మార్పీ ధరలు లేకపోవడం, తదితర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న ఈ వ్యవహారంపై తూనికలు, కొలతల శాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం గడువు ముగిసినా ఎండీయూ వాహనదారులు వేయింగ్ మిషన్లకు సీల్ వేయించుకోలేదని తెలిసింది. కొందరు ఎండీయూలే రేషన్ డీలర్ల అవతారమెత్తి అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆ శాఖ అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ క్రమంలో ఇటీవల రాయచోటిలో జేసీ అధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని చర్చ జరిగినట్లు సమాచారం.



రాష్ట్రాన్ని వైసీపీ అప్పుల ఊబిలోకి నెట్టేసింది

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి


మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, ఆంధ్రజ్యోతి మార్చి2: రాష్ట్రాన్ని వైసీపీ అప్పుల ఊబిలోకి నెట్టేసిందని బీజేపీ రాష్ట అధికార ప్రతినిధి, టీటీడీ బోర్డు మెంబరు భానుప్రకాష్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు వైసీపీ లేదని, గాల్లో తిరిగే సీఎంగా పాలన కొనసాగించారని ఎద్దేవా చేశారు. మంత్రులకు కూడా కలిసే అవకాశం ఇవ్వకుండా ఇప్పుడు ప్రతిపక్ష హోదా కావాలని వైఎస్ జగన్ అడగడం హాస్యాస్పందంగా ఉందన్నారు. ఇదే పద్ధతిలో వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో పదకొండు సీట్లు కూడా ప్రజలు ఇవ్వరన్నారు. పాలన అంటే కూటమి ప్రభుత్వాన్ని చూసి నేర్చుకోవాలని హితవు పలికారు. జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకులకృష్ణమూర్తి, గిరిజన మోర్చా స్టేట్ రీసర్చ్ కో కన్వీనర్ పి. బొజ్జప్ప, ఎస్టీ జిల్లా అధ్యక్షు డు పిల్ల స్వామి నాయక్, నేతలు భగవాన్, జర్మనీ రాజు, పూల నాగరాజు,బండి ఆనంద్, వరథారెడ్డి నారథరెడ్డి, జేకే వర్మ పాల్గొన్నారు.

కూలీల ధరల పెంపుతో హర్షం

జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా స్టాక్ పాయింట్లలో పని చేస్తున్న హమాలీలకు రేట్లు పెంపుపై ఏఐటీయూసీ నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక సివిల్ సప్లయ్ పాయింట్ వద్ద నిర్వహించిన హమాలీల సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ పౌర సరఫరాల సంస్థలో రాష్ట్రవ్యాప్తంగా మండల లెవల్ స్టాక్ పాయింట్లలో పని చేస్తున్న సుమారు ఆరువేల మంది హమాలీలకు వివిధ అంశాలపై రేట్లు పెంపు చేశారన్నారు. కూలీ రేట్లు క్వింటాల్‌కు రూ.25 నుంచి రూ.28 వరకు పెంచడం, దసరా బోనస్ రూ. ఆరువేలు, కూలీ రేట్లకు సంబంధించి 1జనవరి 2024 నుంచి అరియర్స్ చెల్లించేందుకు జీఓలో పేర్కొన్నారన్నారు. ఇది రెండేళ్లు కొనసాగుతుందన్నారు. హమాలీలు అయూబ్, వీరాంజనేయులు, కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

వేడుకగా పార్వేట ఉత్సవం


స్వామి, అమ్మవార్ల ఊరేగింపు

కలకడ, మార్చి 2(ఆంధ్రజ్యోతి): కలకడ సత్యవతి నదీ తీరాన వెలసిన కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పార్వేట ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. స్వామి, అమ్మ వార్లను ప్రత్యేక అలంకరించి మంగళవాయిద్యాలతో వాహనంలో సత్యవతి నదీలోకి ఊరేగింపుగా తీసుకెళ్లారు. నదిలో అర్చకులు విజయసారథి, సుబ్రహ్మణ్యం, మహేష్ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలను చేశారు. పార్వేట ఉత్సవంలో భాగంగా స్వామి ఆట విడుపుగా అడివికి వేటకు వెళతారని చెబుతారు. ఆలయ ధర్మకర్త రవీంద్ర శర్మ, పాలేకరి కులస్థులు, భక్తులు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం మార్చి 2 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడు సతీష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పెద్దతిప్పసముద్రం ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపారు. గత నెల 21న ఎవరూ లేని సమయంలో బూచిపల్లె వాసి బసప్పగారి వినాయకం ఇంట్లోకి ప్రవేశించి నగలు అపహరించాడు. బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఫిర్యాదుపై దర్యాప్తు చేసిన పోలీసులు ఇదే గ్రామానికి చెందిన సతీష్‌ను నిందితుడిగా గుర్తించారు. కానగమాకులపల్లె వద్ద సతీశ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు ఎస్ఐ తెలిపారు.

పరిటాల శ్రీరామ్‌ను కలిసిన శ్రీరామ్‌చినబాబు, మల్లికార్జున

మదనపల్లె టౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌ను తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత సీడ్ మల్లికార్జుననాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మదనపల్లెలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పరిటాల శ్రీరామ్‌తో పలు అంశాలపై చర్చించారు. టీడీపీ నాయకులు దొరస్వామినాయుడు, మార్పూరి వరుణ్, పుల్లయ్య, తెలుగు యువత నాయకులు నాదెళ్ల అరుణ్‌తేజ, బైగారి శశి, మధు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలోకి చేర్చాలి

మదనపల్లె అర్బన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): వాల్మీకి ఎస్టీ సాధన ఉద్యమంగా భవిష్యత్ కార్యాచరణ నిర్ణయించడం కోసం వాల్మీకులు సమావేశం అయ్యారు. ఆదివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిధి గృహంలో వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు పొదల నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.







